ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సత్కారం



ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పెనమలూరు: ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ సోమవారం పెనమలూరుకు వచ్చారు. వైఎస్సార్ సీపీ నేత ఎలికె జగన్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. ఆయన ఆస్పత్రి నుంచి ఇంటికి రావటంతో జగన్‌ను, అతని కుటుంబ సభ్యులను ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను నేతలు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ సంఘ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్తు'

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతుంది. స్థానిక సగర్లపేటలో సోమవారం వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కాసరనేని గోపాలరావు, మండల పార్టీ అధ్యక్ష, కన్వీనర్లు పడమట సురేష్, నీలం ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయాల మండల కన్వీనర్ కైలే శివకుమార్, సచివాలయ కన్వీనర్లు జలసూత్రం రామ్మోహన్‌రావు, కొల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక గ్రామసచివాలయం-2 పరిధిలో కార్యక్రమంలో నీలం ప్రవీణ్‌తో పాటు ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, పడమట రంగారావు, ఎంవీఆర్, లుక్కా ప్రసాద్, మీసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు. గన్నవరం రూరల్: మండలంలోని కొండపావులూరు, గొల్లనపల్లి, తెంపల్లి గ్రామాల్లో సోమవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాలు పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గృహాల యజమానులను కలసి సంక్షేమ పథకాల సరళి వివరించారు. గృహసారథులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

వైద్య బృందాల పర్యటన

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో సోమవారం ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ బృందాలు ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలో సరఫరా అవుతున్న తాగునీరు శాంపిల్స్ తీసి వాటిని పరీక్షలకు పంపారు. కాచి చల్లార్చిన నీటిని గ్రామస్తులు త్రాగాలని ఆయన సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మరుగుదొడ్ల నిర్మాణం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు జీసస్ గ్రేస్ లెప్రసీ కాలనీలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల కోసం ఐదు ప్రత్యేక మరుగుదొడ్లను నిర్మాణం చేశారు. ఈ మేరకు సోమవారం నూతన మరుగుదొడ్లను లబ్ధిదారులకు క్లబ్ చైర్మన్ పి.సీతాదేవి అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కుష్ఠు వ్యాధిగ్రస్తుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కొంత కాలంగా పౌష్టికాహారం, వీల్ చైర్లు అందజేస్తున్నట్లు చెప్పారు. వీరి విజ్ఞప్తి మేరకు తమ క్లబ్ ద్వారా డిసేబిలిటి ఫ్రెండ్లీ మరుగుదొడ్ల నిర్మాణం చేసినట్లు తెలిపారు. కాలనీ వాసులకు తమవంతు సహకారం అందిస్తున్న విన్నర్‌క్లబ్‌కు లెప్రా సొసైటీ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ రాధిక కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ అధ్యక్షురాలు గాయత్రి, మాజీ డిస్ట్రిక్ట్ చైర్మన్ ప్రమీలారాణి, సొసైటీ కౌన్సిలర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలరత్న అవార్డు పొందిన భావన-మేఘన సిస్టర్స్



పెనమలూరు: తాడిగడపకు చెందిన సోదరీమణులు పామర్తి భావన, పామర్తి మేఘనలకు బాలరత్న బిరుదులు ప్రదానం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జయహో భారతీయం, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా ఆధ్వర్యంలో 46 రంగాల్లో ప్రతిభ చూపిన ప్రముఖులకు పురస్కార అవార్డులు ప్రదానం చేశారు. తాడిగడపకు చెందిన చిత్రకారులు 1వ తరగతి చదువుతున్న పామర్తి భావన, 8వ తరగతి చదువుతున్న పామర్తి మేఘనకు బాలరత్న అవార్డులు అందజేశారు. జిల్లా పూర్వ కలెక్టర్ ఇంతియాజ్, డాక్టర్ కేఎస్ రావు అవార్డులు ఇచ్చారు.

ఉయ్యూరులో డెప్యూటీ సీఎం ప్రత్యేక ప్రార్థనలు



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషాను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

ఉయ్యూరు: ముస్లింలు పవిత్ర రంజాన్‌ను భక్తిప్రపత్తులతో జరుపుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్ బాషా ఆకాంక్షించారు. ఉయ్యూరు పట్టణంలోని జామియా మసీద్‌లో సోమవారం ఆయన ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. ప్రార్థనల అనంతరం ముస్లిం పెద్దలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు అంజాద్ బాషాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

చదువుతోనే సమగ్ర అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్ రూరల్: చదువుతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని పలువురు ప్రజా ప్రతినిధులు అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.రాణి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టారని చెప్పారు. ఎంఈవో సక్సేనా రాజు మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదువుకున్న పుసులూరి రవి కిరణ్ సివిల్స్‌లో 655 ర్యాంకు సాధించి స్ఫూర్తిదాయకంగా నిలిచాడన్నారు. ఆళ్ల సావిత్రమ్మ మెరిట్ స్కాలర్‌షిప్ కింద కనకవల్లి సునీత, పేరుమామిళ్లపల్లి సృజనలకు రూ.5 వేలు చొప్పున, బెస్ట్ ఔట్‌గోయింగ్ స్టూడెంట్ అవార్డు కింద గరికపూడి తేజశ్రీ, మేకల శివపార్వతిలకు రూ.4 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఏపీ సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు పుసులూరి లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, దాత ఆళ్ల నరసింహారావు పాల్గొన్నారు.

శ్రీజ్ఞాన సరస్వతీ పీఠం పీఠాధిపతిగా ప్రకాశానందస్వామీజీ



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పోరంకి శ్రీ పరమాత్మనంద ఆశ్రమం శ్రీజ్ఞాన సరస్వతీ పీఠం పీఠాధిపతిగా శ్రీశ్రీశ్రీ ప్రకాశానందస్వామీజీని ఏకగ్రీవంగా నియమించారు.ఈ మేరకు సోమవారం పరమాత్మనంద ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆశ్రమంలో ప్రస్తు పీఠాధిపతి శ్రీ చిన్మాత్రానందగిరి మాతాజీ ఏకగ్రీవ అంగీకారం తెలిపారు. భక్తుల సమక్షంలో శ్రీజ్ఞాన సరస్వతీ పీఠం పీఠాధిపతిగా శ్రీశ్రీశ్రీ ప్రకాశానందస్వామీజీని నియమించారు. కాగా శ్రీశ్రీశ్రీ ఆచార్య శంకరానంద గిరి స్వాముల వారి ద్వితీయ వర్ధంతి భక్తులు ఘనంగా చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం అధ్యక్షురాలు చిన్మాత్రానందగిరి మాతాజీ, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు అండదండగా ఉండాలి

పెనమలూరు: గ్రామాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శులు ప్రజలకు అండదండగా ఉండి ఉత్తమ సేవలు అందించాలని పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు అన్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మండలంలోని మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు గ్రామాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించాలని, మహిళలకు అండదండగా ఉండి వారికి సత్వర న్యాయం అందే విధంగా కృషి చేయాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

నూతన భవనంలోకి యూనియన్ బ్యాంక్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నున్నలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను ప్రస్తుత భవనం నుంచి నూతనంగా నిర్మించిన భవనంలోకి సోమవారం మార్చారు. ఈ సందర్భంగా విజయవాడ ఫీల్డ్ జనరల్ మేనేజర్ నవనీత్‌కుమార్ బ్రాంచ్‌ను ప్రారంభించారు. విజయవాడ రీజనల్ హెడ్ రజనీకాంత్, డిప్యూటీ రీజనల్ హెడ్ రమేష్, ఏజీఎం రామలింగేశ్వరరావు, శంకర్‌రావు, బ్రాంచి హెడ్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా 'దయాల'



పీఏసీఎస్ చైర్మన్ విజయనాయుడికి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా దయాల విజయనాయుడు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా దయాల విజయనాయుడు, సభ్యులుగా బొమ్ములూరుకు చెందిన మట్టా వెంకటేశ్వరరావు, శేరీనరసన్నపాలెంకు చెందిన బళ్ల కాకాని చిట్టెమ్మ ప్రమాణస్వీకారం చేశారు. పలువురు దయాల విజయనాయుడు దంపతులను పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. దయాల విజయనాయుడు గతంలో బాపులపాడు పీఏసీఎస్ డైరెక్టర్‌గా, నూజివీడు ఏఎంసీ డైరెక్టర్‌గా, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్‌లు సరిపల్లి కమలాభాయి, కాటూరు విజయభాస్కర్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, కాకాని వెంకటేశ్వరరావు, మేడేపూడి రామ్మోహనరావు పాల్గొన్నారు.

పోలీసులపై చర్య తీసుకోవాలి

కంకిపాడు: అంబేడ్కర్ వాదులపై దాడి చేసిన సీఐ, ఎస్‌ఐలపై చర్యలు తీసుకోవాలని పీవీరావు మాలమహానాడు ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోగుల మూడి రాజు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పుంగనూరులో అంబేడ్కర్ వాదులపై అక్కడి సీఐ, ఎస్‌ఐలు దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న డెప్యూటీ సీఎం

పెనమలూరు: కానూరులో పలు మసీదుల్లో డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన ఆదివారం రాత్రి కానూరు సనత్‌నగర్‌కు వచ్చారు. ముస్లింలు పవిత్రంగా జరుపుకొనే ఐదు జాగారాల రాత్రులు సందర్భంగా డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం పెద్దలు ఆయనకు ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చాంద్‌బాషా, ఖాదర్, పఠాన్ అహ్మద్, రెహమాన్, సిద్దిక్, లతీఫ్, సైదే, అజీజుల్లా, అహ్మద్, జాఫర్‌ఖాన్, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెలగా లక్ష్మణరావు వర్ధంతి

కంకిపాడు: పేదల పక్షపాతి, భూ పోరాట యోధుడు వెలగా లక్ష్మణరావు ఆశయాలకు నేటి తరం పాటుపడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు కోరారు. సీపీఎం సీనియర్ నాయకుడు వెలగా లక్ష్మణరావు వర్ధంతి కార్యక్రమం పట్టణంలోని మండేపూడి భవన్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఈడా కోటేశ్వరరావు, వి.శివశంకర్, మంచాల చంటిబాబు, సీహెచ్ రెడ్డయ్య, వి.జాన్‌మోజెస్, పి.దుర్గారావు, పీతా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జన్మ నక్షత్ర పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మనక్షత్రం పూర్వభాద్రను పురస్కరించుకుని సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, స్వామివారిని పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అభయాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. దేవస్థానం ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వేదికపై స్వామి వారి పంచలోహ విగ్రహానికి అష్టోత్తర శతకలశాలతో విశేష పూజలు, పంచామృతాలతో అభిషేకాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

కంకిపాడు: పది మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధునాగుల మనోహర్ డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం పీఆర్‌టీయూ నాయకులు డీఈఓ తాహెరా సుల్తానాను కలిసి వినతిపత్రం అందించారు. మూల్యాంకన కేంద్రంలో వేసవి రీత్యా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారిని, ముస్లిం ఉపాధ్యాయులను మూల్యాంకన విధుల నుంచి మినహాయించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సంఘం కంకిపాడు నేతలు వి.సుభాష్‌చంద్రబోస్, ప్రదీప్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మర్లపాలెం, చిన్నఆవుటపల్లి, వేపగుంట, మేఘన రోడ్డు, ఎస్ఎల్వీ అపార్ట్‌మెంట్స్, శ్రీనివాస హేచరీస్ ప్రాంతాల్లో గృహ, వ్యవసాయ కనెక్షన్లకు, దావాజిగూడెం, అల్లాపురం, రాజీవ్‌నగర్ కాలనీ, గన్నవరం వ్యవసాయ కనెక్షన్లకు కూడా విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

రామవరప్పాడు: మిడ్ టౌన్ రోటరీ క్లబ్ నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ కాంపిటేషన్స్‌లో విజయవాడ రూరల్ మండలం నిడమానూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించాడని పాఠశాల ప్రిన్సిపాల్ భువనేశ్వరన్ సోమవారం తెలిపారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న దర్ష్ దోషీ అనే విద్యార్థి సింగిల్స్, డబుల్స్ కేటగిరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈ బహుమతి అందుకున్నాడని తెలిపారు. పాఠశాలలో ఉత్తమ విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అనంతరం బహుమతి సాధించిన విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ బాటియా, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

మాజీ మంత్రి దేవినేని నెహ్రూకు ఘన నివాళి



కానూరులో దేవినేని నెహ్రూ వర్ధంతి నిర్వహిస్తున్న మాజీ సర్పంచి అన్నే చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నేతలు

పెనమలూరు: కానూరు గ్రామంలో సోమవారం మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) ఆరవ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచి వైఎస్సార్ సీపీ నేత అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి(చిట్టిబాబు) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్, నేతలు పిడికిటి రామకోటేశ్వరరావు, చిగురుపాటి దామోదరరావు, అబ్దుల్ లతీఫ్, తుమ్మల వరదీప్, పిన్నబోయిన రవి, వేమూరి బాలకృష్ణ, ఆసీఫ్, అన్నే శ్రావణ్, అజరయ్య, కె.సుబ్బరాజు, అప్పు తదితరులు పాల్గొన్నారు.